గొల్లవీధిలో కంపుకొడుతున్న కాలువలు

పాతనగరం గొల్లవీధిలో మురుగు కాలువలు చెత్తతో నిండి కంపుకొడుతున్నాయి. ఈ ప్రాంతంలో ఇరుకు సందులు ఉండటం, ఇళ్ల ముందు మెట్లు ఏర్పాటు చేసుకోవడం కారణంగా పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు చెత్తలు ఎత్తలేకపోతున్నారు. ఏ పాటి చిన్న వర్షం కురిసినా కాలువల్లో చెత్తలు నిండి వర్షపు నీరు, మురుగు పొంగి పొర్లుతుంటాయి. కాలువల్లో చెత్తలు వేయకుండా స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలి.



గొల్లవీధిలో మురుగుతో నిండిన కాలువ

37వ వార్డులో పారిశుధ్యం అధ్వానం

37వ వార్డు పంజాబ్ జంక్షన్‌లో చెత్తలు పేరుకుపోతున్నాయి. ఇరుకు సందులు కావడంతో కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీసేందుకు ఇబ్బందులున్నాయి. భూగర్భ డ్రైనేజీలు ఎక్కడికక్కడ పొంగిపొర్లుతున్నాయి. ఈ ప్రాంతంలో ఉండేది బడుగు, బలహీన వర్గాలే.



అధ్వానంగా కాలువ, యూజీడీ

ఇలాగైతే దోమలు విజృంభించవా..?

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చాలా చోట్ల ఇంకా నిలిచే ఉంది. దీంతో మురుగంతా కంపు కొట్టడమే గాక దోమల సంతతి ఎక్కువైంది. ఇందిరా ప్రియదర్శినీ మున్సిపల్ స్టేడియం వెనుక ప్రసాద్ గార్డెన్స్‌లో అర్బన్ హెల్త్ సెంటర్‌కు వెనుక భాగాన వర్షపు నీరు ఇలా తిష్టవేసింది. వెంటనే తొలగించాల్సిన అవసరం ఉంది.



ప్రసాద్ గార్డెన్స్ హెల్త్ సెంటర్ వెనుక భాగాన నిల్వ ఉన్న వర్షపు నీరు

క్లుప్తంగా

మెజీషియన్ బాషాకు లైమ్‌లైట్ అవార్డు



అన్వర్ బాషాకు అవార్డు అందిస్తున్న మావూరి వెంకటరమణ తదితరులు

డాబాగార్డెన్స్: ఇంద్రజాలికుడు షేక్ అన్వర్ బాషాకు బెస్ట్ మెజీషియన్ ఆఫ్ ది ఇయర్ లైమ్‌లైట్–2024 అవార్డు లభించింది. విశాఖపట్నం ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును నిర్వాహకులు సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ఆయన అందజేశారు. కళారంగాలకు చెందిన సింగర్స్, యాంకర్స్, మ్యాజిక్, మిమిక్రీ, నృత్యం తదితర అంశాల్లో ప్రతిభావంతులైన కళాకారులకు లైమ్‌లైట్–2024 పేరిట సత్కరించారు.

జూలో రేపు చిత్రలేఖన పోటీలు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో ఆదివారం విద్యార్థులకు పులులపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ఒకటో తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పోటీలు జూలో జరుగుతాయన్నారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు పులులు, వాటి పిల్లలు, 6 నుంచి 10వ తరగతి వరకు పులులపై మానవ ప్రభావం, ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు పులులపై వాతావరణ మార్పులు అనే అంశాలుపై చిత్రాలు వేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 29న ఫొటోగ్రఫీ పోటీలు కూడా నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు, పాల్గొన్న అందరికీ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

మహారాణిపేట: మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ కోరారు. అమరావతిలోని సచివాలయంలో మత్స్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎ.బాబుతో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై జానకీరామ్, ఇతర బోట్ల యజమానులు శుక్రవారం సమావేశమయ్యారు. ఇటీవల తుఫాన్ సందర్భంగా గోపాల్‌పూర్ పోర్టులోకి విశాఖపట్నం ఫిషింగ్ బోట్లను అనుమతించకుండా ఇబ్బంది పెట్టిన విషయాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తెచ్చారు. తుఫాను తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో గోపాల్‌పూర్ పోర్టు సెక్యూరిటీ బోట్లపైకి రాళ్లు విసిరి పోర్టు వెలుపలకు ఫిషింగ్ బోట్లను ఘోరంగా పంపించడంతో మత్స్యకారుల ప్రాణానికి రక్షణ లేకుండా పోయిందన్నారు. మరోవైపు 2 వేల మంది మత్స్యకారులు మత్స్యకార భరోసాకు అనర్హులని విశాఖ జిల్లా మత్స్యశాఖ జేడీ కార్యాలయం ప్రకటించడంతో ఎంతో మంది తీవ్రంగా నష్టపోతారన్నారు. మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్లకు ఇన్సూరెన్స్ వర్తింప జేయాలని కోరారు. దీనిపై ప్రిన్సిపల్ సెక్రటరీ స్పందించారని, గోపాల్‌పూర్ పోర్టుకి వెళ్లే మత్స్యకారులను ఇబ్బంది పెట్టొద్దని గంజాం జిల్లా కలెక్టర్‌కి, ఒడిశా ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి లేఖ రాస్తామన్నారని జానకీరామ్ తెలియజేశారు.

మడ అడవులతో తీరం భద్రం

బీచ్ రోడ్డు: మడ అడవులతో తీర ప్రాంతం కోతకు గురికాకుండా ఉంటుందని క్లైమేట్ ఫ్రంట్ వైజాగ్ గ్రూప్ ప్రతినిధి ఒయింద్రిలా అన్నారు. ప్రపంచ మడ అడవుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్కేబీచ్‌లో వాటి పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మడ అడవుల వల్ల తాబేళ్లు, పక్షులు వంటి వన్యప్రాణులు జీవించవచ్చన్నారు. అభివృద్ధి పేరిట మడ అడవులను నరకడం పర్యావరణానికి హానికరమన్నారు. కార్యక్రమంలో సభ్యులు అంజనా, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కలవరం

సీజనల్ వ్యాధులపై ప్రజల్లో ఆందోళన

- వీధుల్లో అధ్వానంగా పారిశుధ్యం
- దోమల వృద్ధితో విజృంభిస్తున్న విషజ్వరాలు
- పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన అవసరం
- కళాజాతాలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలి



పండా వీధిలో పేరుకుపోయి చెత్త

డాబాగార్డెన్స్: ప్రజల ఆరోగ్య పరిరక్షణపై అధికారులు దృష్టి సారించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రతి ఏటా సీజనల్ వ్యాధులపై వివిధ రూపాల్లో ప్రజలకు అవగాహన కల్పించేది. కళాకారులను ఊరూరా పంపి కళాజాతాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహింపజేసేది. నేడు అది లోపించింది.

నియోజకవర్గంలోని పాతపోస్టాఫీస్, అల్లిపురం బీంనగర్, ప్రసాద్ గార్డెన్స్, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లోని పబ్లిక్ హెల్త్ సెంటర్ల పరిధిలో ఏఎన్ఎంలు, ఆయాల సహకారంతో నడస్సులు నిర్వహించేవారు. మురికివాడల్లోని ప్రజలకు మరింత చేరువయ్యేందుకు బుర్రకథల రూపంలో కళాకారులు సీజనల్‌గా వచ్చే వ్యాధులు, తీసుకోవల్సిన జాగ్రత్తలను పాట మాదిరిగానో.. కథలాగానో చెప్పేవారు. సీజనల్ వ్యాధులు, తీసుకోవల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులపై అవగాహన కల్పించడంతోపాటు పిల్లల్లో ఐదు వ్యాధులను నియంత్రించే పెంటావాలెంట్ వ్యాక్సిన్ ఉపయోగాలను సరదాగా వివరించేవారు. అన్నీ కథల్లా ఉండటంతో ప్రజలు ఆసక్తిగా తిలకించేవారు. కొంతవరకైనా అవగాహన పెంచేవారు.

ప్రస్తుతం పబ్లిక్ హెల్త్ సెంటర్ల స్థానంలో ఆరోగ్య కేంద్రాల పేరిట ఈ వైద్యం వచ్చేసరికి ఆరోగ్య శాఖ ప్రజలకు అవగాహన కల్పించే విషయంలో వెనుకడుగు వేస్తోంది. నగరంలో ఎక్కడ చూసినా వైరల్ ఫీవర్ విజృంభిస్తోంది. జ్వరాలతో జనం మంచాన పడుతున్నారు. మురికివాడలతో పాటు పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రత లేకపోవడంతోనే వ్యాధులు వ్యాపిస్తాయన్న విషయాన్ని ప్రజలకు చెప్పడం ఎంతైనా అవసరం.

చర్యలు చేపడుతున్నాం

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించే విషయమై చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా మురికివాడ ప్రాంతాల్లో కళాజాతలు, వివిధ రూపాల్లో అవగాహన కల్పించనున్నాం. అందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం.

– డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

పండా, సున్నపు వీధులు చెత్తమయం

మురికివాడ ప్రాంతం పండా వీధిలో నివసించేది బడుగు బలహీన వర్గాల వారే. కూలిపనులు చేసుకుని జీవిస్తున్నవారే. పండా వీధి, ప్రసాద్ గార్డెన్స్, వెలంపేట తదితర ప్రాంతాల ప్రజలు ఇక్కడే చెత్తలు వేస్తుంటారు. ఈ ప్రాంతంలో సుమారుగా 300 నుంచి 400 కుటుంబాలు ఉంటున్నాయి. అవగాహన లోపం కారణంగా ఎక్కడపడితే చెత్తలు వేసేస్తున్నారు.



సున్నపు వీధిలో చెత్త తింటున్న ఆవు

- 36వ వార్డు సున్నపు వీధిలో చెత్త సమస్య తాండవిస్తోంది. ఈ ప్రాంతంలో ఎక్కువగా నివసించేది ముస్లిం మైనారిటీలు, బడుగు బలహీన వర్గాల వారే. సుమారుగా 100 నుంచి 150 కుటుంబాలు నివసిస్తున్నాయి. పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపడితే తప్ప.. ఈ సమస్యకు పరిష్కార మార్గం లేదు.

పూర్ణా మార్కెట్ వద్ద చెత్త డంపింగ్

పూర్ణామార్కెట్‌పై ఆధారపడి సుమారుగా 200 దుకాణాలు ఉన్నాయి. మార్కెట్‌కు సమీపంలో పలు నివాస గృహాలు కూడా ఉన్నాయి. వీరంతా పూర్ణామార్కెట్‌కు ఉత్తర భాగాన కోడిమాంసం, చేపలు విక్రయించే ప్రాంతం వద్ద పెద్ద ఎత్తున చెత్త డంప్ చేస్తున్నారు. పారిశుధ్య కార్మికుల లోపం ఏమాత్రం కాదు. ప్రతి రోజూ వారు చెత్తను తరలిస్తూనే ఉన్నారు. కానీ ఇటు దుకాణదారులు.. చిరు వ్యాపారుల్లో అవగాహన లోపం కారణంగా ఎప్పటికప్పుడు చెత్తను వేసేస్తుండటంతో డంపింగ్ యార్డులా తయారవుతోంది.



అధ్వానంగా పూర్ణామార్కెట్ పరిసరాలు

స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్: నీట్, జేఈఈ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు తర్ఫీదునిచ్చే శిక్షణ కార్యక్రమానికి సంబంధించి స్కాలర్‌షిప్స్ పొందేందుకు నిర్వహించే 'అంతే–2024' ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆకాష్ విద్యా సంస్థల విశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, రీజనల్ మార్కెటింగ్ హెడ్ నిషాంత్ మిత్రా తెలిపారు. శుక్రవారం సంస్థ కార్యాలయంలో వారు పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. 15 ఏళ్లుగా దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, లక్షలాది మంది విద్యార్థులు స్కాలర్‌షిప్ ద్వారా లబ్ధి పొందారన్నారు. ప్రతి ఏటా ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి ఉచితంగా అమెరికాలోని ఫ్లోరిడా నాసాకు పంపుతున్నామని చెప్పారు. పోటీ పరీక్ష ద్వారా 100 శాతం స్కాలర్‌షిప్ పొందడంతోపాటు ఉత్తమ విద్యార్థులకు ఇతర ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. అంతే ఆఫ్‌లైన్ పరీక్షలు అక్టోబర్ 20 నుంచి 27 వరకు దేశ వ్యాప్తంగా ఆకాష్ ఇన్‌స్టిట్యూషన్లలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు, ఆన్‌లైన్‌లో అక్టోబర్ 19 నుంచి 27 వరకు పరీక్ష విండో సమయంలో ఎప్పుడైనా నిర్వహించవచ్చని చెప్పారు. వివరాలకు anthe.aakash.ac.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, జి.రాజేష్‌కుమార్, డాక్టర్ లిఖిత, సురేష్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.




అర్హత పరీక్ష పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆకాస్ యాజమాన్యం

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శుక్రవారం ప్రత్యేక పూజ నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. రూ.500 చెల్లించిన దంపతులు లేదా ఇద్దరు భక్తులు ఈ పూజలో పాల్గొనవచ్చని చెప్పారు. భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారులు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పూజలో పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తుల ట్రాన్సక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 89855 15989కు వాట్సాప్ చేయాలి.



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

రైల్వేస్టేషన్‌లో 31.2 కిలోల గంజాయి పట్టివేత

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న యువకులను రైల్వే పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది విశాఖ రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన ఆకాష్, పాడువకు చెందిన ఖేముందు, హర్యానాకు చెరందిన అవినాష్, బీహార్‌కు చెందిన అమృత్‌కుమార్, కేరళకు చెందిన టామ్ అలెక్స్‌లు అక్రమంగా గంజాయిని రవాణా చేయడం గుర్తించారు. వీరు ఈ గంజాయిని విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా కేరళ, కర్ణాటక, హర్యానా, బిహార్ రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి సుమారు రూ.1,04,500 విలువైన 31.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను శుక్రవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అరెస్ట్ చేశారు. రామా టాకీస్ రోడ్డులోని ప్రభుత్వ కంటి ఆస్పత్రి ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు గంజాయి తరలిస్తున్నట్లు సమాచారంతో పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. సుమారు 15.61 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేరళ రాష్ట్రం త్రిశూల్‌కు చెందిన సఫాల్ సలీం, సునీల్‌కుమార్, అబిన్ సుబ్రాన్‌లు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటిండెంట్ యు.సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్ టి.వెంకటప్పలనాయుడు, ఎస్ఐ, ఎస్.ముసలనాయుడు, డీటీఎఫ్ ఎస్ఐ వేణుగోపాల్, హెచ్‌సి.శ్రీనివాస్, (టాస్క్‌ఫోర్స్) కానిస్టేబుళ్లు అప్పలనాయుడు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయితో ఐదుగురు రవాణాదారులు

డయేరియాపై అవగాహన అవసరం



పాఠశాలలో పరిశీలిస్తున్న డాక్టర్ చక్రవర్తి

మహారాణిపేట: పిల్లలకు డయేరియాపై అవగాహన అవసరమని కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ బీఎస్ చక్రవర్తి సూచించారు. నగరంలోని అన్ని జీవీఎంసీ పాఠశాలల్లో ఓఆర్ఎస్ వారోత్సవాలను పురస్కరించుకుని అవగాహన కల్పించారు. చెంగలరావుపేటలో ఉన్న జీవీఎంసీ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డయేరియా నిరారణ, ఓఆర్ఎస్ ప్రాముఖ్యత, పరిసరాల శుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పించారు. ఓఆర్ఎస్ కోసం డాక్టర్ చక్రవర్తి రూపొందించిన ప్రత్యేక పాట ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులకు పాటల పోటీలు, తోలుబొమ్మల ప్రదర్శన, క్విజ్ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు నిర్మల, హరిత, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, వెంకటలక్ష్మి, సదాశివరావు, పాఠశాల హెడ్ మాస్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం రేపు



కరపత్రికను ఆవిష్కరిస్తున్న కేంద్ర గౌరీ సేవా సంఘం ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: కేంద్ర గౌరీ(గవర) సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ గవర విద్యార్థులకు ఈ నెల 28న బహుమతుల ప్రదానోత్సవం, అభినందన సభ నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు బుద్ధ శివాజీ తెలిపారు. అక్కయ్యపాలెం జాతీయ రహదారి పక్కన గల పోర్టు కళావాణి ఆడిటోరియం(విశ్వనాథ్ కన్వెన్షన్స్)లో ఆదివారం ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రైల్వే న్యూకాలనీలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ముందుగా వివరాల కరపత్రికను ఆవిష్కరించారు. శివాజీ మాట్లాడుతూ ఈ ఏడాది విడుదలైన పరీక్షా ఫలితాల్లో 80 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన సుమారు 600 మంది గవర సామాజిక వర్గ విద్యార్థులకు బహుమతులు, దరఖాస్తు చేసుకున్న వారందరికీ కన్సోలేషన్ బహుమతులను అందజేస్తున్నామని చెప్పారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని ఎందరో గవర జాతీయులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఏడాది నుంచి పేద, అనాథ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ కూడా అందజేస్తామని శివాజీ తెలిపారు.

దొండపర్తి యూపీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

మహారాణిపేట: దొండపర్తి యూపీహెచ్‌సీ పరిధిలోని పలు వీధుల్లో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు పర్యటించి, నీటి నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, గర్భిణుల జాబితా తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లు ఎనీమియా బాధితులను గుర్తించి వారికి మాత్రలు అందజేయాలని తెలిపారు. అన్ని యూపీహెచ్‌సీల్లోనూ సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సీ–సెక్షన్ ప్రసవాలను నివారించాలని ఆరోగ్య సిబ్బంది, వైద్యులను కోరారు. అందరూ సమయపాలన పాటించాలని, స్టాప్ డయేరియా ప్రోగ్రాం మీద అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వర్షా కాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని చెప్పారు. దోమల నిర్మూలనకు శుక్రవారం డ్రైడే–ఫ్రైడే పాటించాలని స్థానిక ప్రజలను డీఎంహెచ్‌వో కోరారు. జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) ఎం.నాగేశ్వరరావు, ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



దొండపర్తిలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు తదితరులు

కార్గిల్ వీరులే యువతకు ఆదర్శం



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ విభాగం సభ్యులు

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో శుక్రవారం 25వ కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కార్గిల్ వీరులకు కొవ్వొత్తులు వెలగించి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు మాట్లాడుతూ ప్రాణాలు త్యాగం చేసిన కార్గిల్ యుద్ధ వీరుల గురించి విద్యార్థులకు వివరించారు. హవల్దార్ ఎల్.శ్యామలరావు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు లెక్కచేయకుండా దేశం కోసం పోరాడిన సైనికులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డీన్ జి.శంకర నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, పి.గాంధీ, పైడి రజని, జీవీఎస్ఎల్ శ్రీనివాసరావు, ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ కమాండర్ ప్రసన్నకుమార్, కెప్టెన్ జె.రామారావు, లెఫ్టినెంట్ జి.సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అర్చన, గాయత్రి, వెంకటరత్నం పాల్గొన్నారు.

- విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ భారతీయులంతా తరతరాలుగా గర్వంగా గుర్తించుకునే రోజు జూలై 26 అని పేర్కొన్నారు. కార్గిల్ యుద్ధంలో సైనికుల పోరాటం, త్యాగం మరువలేమని కొనియాడారు. ఎన్‌సీసీ అధికారి డాక్టర్ కె.గీతాంజలి మాట్లాడుతూ సైనికుల ధైర్య సాహసాలు, త్యాగం వల్లే దేశ పౌరులు నిశ్చింతగా జీవించ గలుగుతున్నారన్నారు. కార్గిల్ దివస్‌ను పురస్కరించుకుని కళాశాల దత్తత గ్రామాల్లో కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, అరుణపద్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కార్గిల్ వీరులకు నివాళులర్పిస్తున్న ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ తదితరులు

సమస్యలపై ఎంఈఎస్ బిల్డర్స్ అసోసియేషన్ నిరసన

తాటిచెట్లపాలెం: ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను తక్షణం పరిష్కరించాలని మిలటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం బ్రాంచి చైర్మన్ జి.వి.రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్‌లోని చీఫ్ ఇంజినీర్(నేవీ) ఎంఈఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన దినం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రీ ఎన్‌లిస్ట్‌మెంట్ కేసులను ఆమోదించాలన్నారు. గ్యారిజన్ ఇంజినీర్‌తో పని పూర్తి సర్టిఫికెట్, వర్కింగ్ గ్రూప్ సిఫార్సులను అందజేసిన వెంటనే పెర్ఫార్మెన్స్‌లో సెక్యూరిటీలో 50 శాతం విడుదల చేయాలని కోరారు. పునర్విభజన ప్రక్రియ పూర్తయ్యే వరకు రూ.25 లక్షల నుంచి రూ. 50 లక్షల్లోపు కాంట్రాక్టులను ఈ క్లాస్ కాంట్రాక్టర్లకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

సెల్‌ఫోన్ టెక్నీషియన్లను ప్రభుత్వం ఆదుకోవాలి

సీతంపేట: విశాఖలో పని చేస్తున్న సెల్‌ఫోన్ టెక్నీషియన్లు అందరూ ఒక తాటిపై నడిచి తమ భవిష్యత్‌ను కాపాడుకోవాలని టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలో సెల్‌ఫోన్ వృత్తిలో ఉన్న టెక్నీషియన్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. సెల్‌ఫోన్ టెక్నీషియన్లను కార్మికులుగా గుర్తించి విశ్వకర్మ యువజన పథకం కింద సదుపాయాలు కల్పించాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సెల్‌ఫోన్ టెక్నీషియన్లకు ట్రైనింగ్ అందించి ఉపాధి కల్పించాలన్నారు. ఇప్పటివరకు విశాలో 250 మందికి సభ్యత్వం ఇచ్చామని, ఈ నెలాఖరులోగా 400 మంది వరకు సభ్యులుగా చేరే అవకాశం ఉందని చెప్పారు. సెల్‌ఫోన్ టెక్నీషియన్లకు ఎప్పుడూ సొసైటీ సహాయ సహకారం ఉంటుందని తెలిపారు. సమావేశంలో యూనియన్ నాయకులు ప్రసాదు, దాము, రాజేష్, అహ్మద్, అమ్రుష్, వివిధ జిల్లాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్